# అగ్రకుల దురహంకార దాష్టీకం

**మధ్యప్రదేశ్‌లోని** శివపూర్‌లో ఒక పంచాయితీ భవనానికి సమీపంలో ఇద్దరు దళిత పిల్లలు బహిరంగ మలవిసర్జన చేశారనే కారణంతో యాదవులైన ఇద్దరు అన్నదమ్ములు వారిని కావాలనే హత్య చేశారు. బిజెపి-మోడీ ప్రభుత్వ పరిపాలన మన 'ఆధునిక భారతం'లో కులతత్వ ఉన్మాదం పరాకాష్టకు చేరుకుందన్న విషయాన్ని ఈ సంఘటన తేటతెల్లం చేస్తోంది. "నేరారోపణ చెయ్యబడ్డ ఇద్దరు వ్యక్తుల మానసిక పరిస్థితి సరిగా లేదు" అనే వంకలతో పోలీసు ఉన్నతాధికారులు వారి నేరాన్ని కప్పిపెట్టే ప్రయత్నం చేశారు. వాస్తవానికి సాక్ష్యాలన్నీ నేరారోపణ చేయబడ్డ వారికి వ్యతిరేకంగా వున్నాయి. రెండు సంవత్సరాల నాడు బాధిత కుటుంబం, నిందితుల భూమిని గుడిసె వేసుకు నేందుకు తీసుకున్నప్పటి నుండి ఆ కుటుంబంపై నిందితులు కక్ష పెంచుకున్నారు. ఇంకా, ఆ ఇద్దరు పిల్లల తలలపై చావబాది, వారు నెత్తుటి మడుగులో బాధతో విలవిలలాడుతుండగా వీడియోలు తీశారు. ఇంత స్పష్టంగా సాక్ష్యాలు వున్నప్పటికీ నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారంటే పాలనా యంత్రాంగం ఎంతగా అగ్రకుల సమీకరణల్లో వుందో తెలుస్తోంది. దళితులపై, మైనారిటీలపై సాగుతున్న దురాగతాలపై, అమానవీయ హింసపై ఉన్నతాధికారులైన పోలీసులు, శాంతిభద్రతలను పరిరక్షించవలసిన వాళ్ళు కపటత్వంతో వ్యవహరించటం ఇదే మొదటిసారి కాదు.

ఎంతోకాలంగా మన సమాజంలో కొనసాగుతూ వస్తున్న అత్యంత దుర్మార్గమైన కులవ్యవస్థ చట్రంలో అట్టడుగువారైన దళితులపై అత్యంత అమానవీయ, పాశవిక ప్రవృత్తికి నిదర్శనంగా నిలిచిన ఈ సంఘటన మొత్తం మన దేశానికే అవమానకరమైనది. అమెరికా అధ్యక్షుడు ట్రంపు మోడీని 'జాతిపిత' అని ఆకాశానికెత్తేసినా, మిలిండా గేట్స్ ఫౌండేషన్ 'ప్రపంచ పరిరక్షకుడని' మోడీపై ప్రశంసల జల్లు కురిపించినా ఈ అపఖ్యాతి చెరిగిపోయేది కాదు. ఇలా కీర్తించటం వెనుక వారి లెక్కలు వారి కున్నాయి. భారత మార్కెట్ నుండి లబ్ధిపొందటం, అమెరికాలో నివసించే భారతీయుల ఓట్లను పొందటం అనేవే ఆ లెక్కలు. ముగ్గురు నోబెల్ గ్రహీతలు ఉత్తరఐర్లాండుకు చెందిన శాంతి కాముక కార్యకర్త మైరీడ్‌మెగైస్, యెమన్‌కు చెందిన విలేకరి, రాజకీయవేత్త అయిన తవక్కుల్ అబ్దుల్ సలామ్ కర్మాన్, ఇరానీ న్యాయవాది, రాజకీయ కార్యకర్త అయిన షిరిన్ ఎబాడీలు- గేట్స్ ఫౌండేషన్ మోడీకి ఇచ్చిన బిరుదులపట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మోడీ నాయకత్వంలో భారతదేశంలో పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయని, అశాంతి ప్రబలుతోందని, ప్రజాస్వామ్యం పాతరవేయబడు తోందని వారు విమర్శించారు. గేట్స్ ఫౌండేషన్‌ను ఉద్దేశించి వారింకా ఏమన్నారంటే "మీ ఫౌండేషన్ జీవితాలను కాపాడటం, అసమానతలపై యుద్ధం చేయటం కార్యక్రమంగా పెట్టుకున్నట్లు ప్రకటించటం మమ్మల్ని మరీ ఇబ్బంది పెడుతోంది".

నేడు, రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కు దళితులకు, మైనారిటీలకు నిరాకరింప బడుతోంది. అడ్డూ, అదుపు లేని హింస వారిపై చోటుచేసుకుంటోంది. మతతత్వ, అగ్రకుల దురభిమాన ఆరెస్సెస్ నేతృత్వంలో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం ఈ హింసపై మౌనం వహించటం ద్వారా ఆమోదాన్ని తెలుపుతోంది.

అత్యంత దారుణమైన దళిత బాలల హత్య వెనుక అసలు కారణం బహిరంగ మలవిసర్జన కానే కాదు. కులతత్వమే ప్రధాన కారణం. అగ్రకులాలు, దళిత కులాల వారిని ఏమైనా చేయవచ్చనే వాతావరణం అగ్రకుల దురహంకారులను నిస్సంకోచంగా క్రూరమైన దురాగతాలకు పాల్పడేలా చేస్తున్నది. శిక్షలు పడతాయన్న భయం కూడా లేదు. హిందూ మతతత్వశక్తులకు, వారి అర్ధఫ్యూడల్ సమాజం దృష్టిలో దళిత కులాల ప్రజల జీవితాలకు ఏవిధమైన విలువా లేదు.

అణగారిన దళితుల జీవించే హక్కును కాపాడుకోవటానికై ప్రజలు ఈ క్రూరత్వాన్ని ఎదిరించి పోరాడవలసిన అవసరం వుంది.

ooo